భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, ఫిబ్రవరి 29 : భక్తి భావంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారం మార్కండేయస్వామి విగ్రహ, యంత్ర ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్‌మోహన్, ఎంపీటీసీ బడుగు రమేశ్, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మీనర్సు, నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్, రమేశ్, వెంకటేశం, లత, నర్సింహ పాల్గొన్నారు.

కుల వివక్షను వీడాలి : తాసీల్దార్

అనంతారంలో మాట్లాడుతున్న తాసీల్దార్ అంజిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : కుల వివక్షను విడనాడి ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని తాసీల్దార్ అంజిరెడ్డి అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అనంతారం గ్రామంలో గురువారం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు, రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుల వివక్ష పాటిస్తే చర్యలు : ఎంపీపీ మంగమ్మ

మొరిపిరాల గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ మంగమ్మ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 29 : గ్రామాల్లో కుల వివక్షత పాటిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ తండ మంగమ్మ అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని మొరిపిరాల ఎస్సీ కాలనీలో గురువారం గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎస్సీ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీఓ నిరంజన్ వలీ, ఏపీఎం కిరణ్, ఆర్ఐ మల్లికార్జున్ రావు, పంచాయతీ కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

తుర్కలశాపురంలో పౌరహక్కుల దినోత్సవం

గుండాల, ఫిబ్రవరి 29 : మండలంలోని తుర్కలశాపురంలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాలు, మూఢ నమ్మకాలు, అంటరానితనం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వసతి గృహ సంక్షేమ అధికారి రమణారెడ్డి, ఎస్ఐ యాకన్న, ఏఎస్ఐ ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టైలరింగ్, మగ్గం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య



ఉచిత టైలరింగ్, మగ్గం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 29 : ఉచితంగా నిర్వహించే టైలరింగ్, మగ్గం వర్క్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య అన్నారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో హునార్ హాత్ స్కీమ్, బేటీ బచావో – బేటీ పడావో, బాలికలను రక్షిద్దాం – బాలికలను చదివిద్దాం అనే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పహాడీనగర్‌లో ఉచిత టైలరింగ్, మగ్గం వర్క్స్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు, యువతులు, మహిళలు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి సరైన వృత్తి మార్గాన్ని ఎంచుకొని స్వయం సమృద్ధి పొందాలన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం అధికారులు హర్ష, భార్గవి మాట్లాడుతూ మహిళలందరూ అన్ని రంగాల్లో సాధికారతను సాధించే దిశగా పయనించాలన్నారు.

కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ బానోత్ వెంకట్‌నాయక్, డీఎండబ్ల్యూఓ జూనియర్ అసిస్టెంట్ అబ్దుల్ మాజీద్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ నిఖిత, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు పాశం అలివేలు, మాజీ కౌన్సిలర్ లాయక్ అహ్మద్, జనార్దన్, రమణ, వాసు, రాజశేఖర్, ట్రైనింగ్ టీచర్ లక్ష్మి, విద్యార్థినులు, యువతులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వినతి

చౌటుప్పల్, ఫిబ్రవరి 29 : మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో 165, 167, 168, 169, 170 సర్వే నెంబర్లలో ప్లాట్ల రోడ్లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ సుల్తాన్ రాజు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. భూ ఆక్రమణదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్ రాజు

పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

● జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : గ్రామ పంచాయతీకి సంబంధించిన ఏడు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈఓ పి.శోభారాణి సూచించారు. గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో గల వన నర్సరీలో మొక్కలను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, మొక్కల పెంపకంతోపాటు వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట పంచాయతీరాజ్ ఏఈ ఎస్.సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి డి.పద్మారెడ్డి ఉన్నారు.

నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ శోభారాణి

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీ

వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డి

రాజాపేట, ఫిబ్రవరి 29 : మండలంలోని జాల గ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు చోరీ జరిగింది. గ్రామానికి చెందిన గుంటి మధుసూదన్‌రెడ్డి, మొగిలి వెంకటయ్యకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పగుల గొట్టి అందులో ఉన్న కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలి

● కలెక్టర్‌కు దత్తప్పగూడెం వాసి వినతి

మోత్కూరు, ఫిబ్రవరి 29 : మండలంలోని పొడిచేడు (ఖుర్దు) రెవెన్యూ గ్రామ పరిధిలోని కల్మెకంటలో 25.24 ఎకరాల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని దత్తప్పగూడేనికి చెందిన కంచర్ల యోగిందర్‌రెడ్డి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మోత్కూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. దళితులకు భూమి పంపిణీ చేసేందుకు గత ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గ్రామంలోని 1,2/ఎ, 285, 286, 287 సర్వే నంబర్లలో 25.24 ఎకరాల భూమిని 2003లో తమ వద్ద నుంచి కొనుగోలు చేసిందన్నారు. ఆ భూమిని దత్తప్పగూడేనికి చెందిన 20 మంది మహిళలకు వ్యవసాయ సాగు కోసం పట్టా చేసిందని తెలిపారు. ఇప్పుడు ఆ భూమిని ఇతర గ్రామాలకు చెందిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దళిత మహిళకు మాయమాటలు చెప్పి కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి ఎన్ఓసీ లేకుండానే తాసీల్దార్ కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. సదరు భూమి పక్కన సర్వే నంబర్ 296లో తనకు 6.15 ఎకరాల భూమి ఉన్నదని, ఆ భూమిని తక్కువ ధరకు అమ్మాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. దౌర్జన్యంగా తన భూమిలో రాతి కడీలు నాటారని తెలిపారు. ఎన్ఓసీ లేకుండా ప్రభుత్వ భూమిని అక్రమంగా కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి : బీఆర్ఎస్

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 29 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గడ్డమీది రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందివ్వడంతోపాటు రైతులకు రైతు బంధు ఇవ్వాలన్నారు. రేషన్ కార్డు ఉన్నవారికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామనడం సరికాదని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో నెరవేర్చకుంటే ప్రజలు తిరగబడడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు బీసు చందర్‌గౌడ్, పంజాల వెంకటేశ్‌గౌడ్, నాయకులు దశరథగౌడ్, సత్తయ్య, రాజు, స్వామి, ఆరోగ్యం పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం

భువనగిరి సిటీ, ఫిబ్రవరి 29 : లీఫ్ సంవత్సరం సందర్భంగా వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ భువనగిరి జిల్లా అధ్యక్షుడు జీడిగం లక్ష్మయ్య గురువారం నిరుపేద కుటుంబాలకు, మున్సిపల్ కార్మికులకు 150 కిలోల బియ్యం అందజేశారు. వాసవీ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ సుగ్గల చంద్రశేఖర్, కోశాధికారి సోమ బనారస్, చార్టర్ ప్రెసిడెంట్ పోకల సోమన్న, సభ్యులు ప్రభాకర్, కరుణాసాగర్, భాస్కర్, శ్రీకాంత్, సత్యనారాయణ, సోమశేఖర్, రవీందర్, బాలేశ్ పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై అపరాధ రుసుం మాఫీ

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 29 : మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయిపై అపరాధ రుసుం 90 శాతం ప్రభుత్వం మాఫీ చేసిందని, 10 శాతం మాత్రమే చెల్లించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కొండల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీఓ నంబర్ 101 ద్వారా మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లింపుదారులకు వన్‌టైమ్ స్కీమ్ కింద ఈ అవకాశాన్ని కల్పించిందని పేర్కొన్నారు. పట్టణంలోని గృహ యజమానులు, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆస్తి పన్ను వడ్డీపై 90 శాతం రాయితీ

మోత్కూరు, ఫిబ్రవరి 29 : ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రాయితీ ఇస్తున్నదని, పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని మోత్కూరు మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో 567 మంది గృహ యజమానులు రూ.18లక్షల బకాయి చెల్లించాల్సి ఉన్నదని తెలిపారు. ఇంటి పన్ను బకాయి మొత్తం చెల్లిస్తే వడ్డీపై ప్రభుత్వం రాయితీని అందిస్తున్నదని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ గృహ యజమానులు వినియోగించుకోవాలని సూచించారు.

యువతి అదృశ్యం

మనీషా (ఫైల్)

వలిగొండ, ఫిబ్రవరి 29 : మండలంలోని గోకారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోకారం గ్రామానికి చెందిన నారి అశోక్ కుమార్తె మనీషాకు 2020లో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మనీదుగూడెం గ్రామానికి చెందిన గుత్తా శ్రీశైలంతో వివాహమైంది. వారి మధ్య గొడవ రావడంతో విడాకులు తీసుకున్న మనీషా 6 నెలలుగా తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నెల 23న సూర్యాపేటలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లిన ఆమె బుధవారం ఇంటికి వస్తూ అదృశ్యమైంది. బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

మూడు నెలలుగా అందని వేతనం

● అవస్థలు పడుతున్న ఉపాధి హామీ ఉద్యోగులు ● అప్పులు తెచ్చుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్న వైనం

గుండాల మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ ఉపాధి హామీ కార్యాలయం

గుండాల, ఫిబ్రవరి 29 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో ఒక ఏపీఓ, ఒక ఈసీ, నలుగురు టీఏలు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. నిత్యం క్షేత్ర స్థాయిలో పనిచేసే వీరికి జీతాలు రాకపోవడంతో వడ్డీకి అప్పులు తెచ్చుకుని కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే నెలనెలా జీతాలు వస్తాయని ఆశగా ఎదురు చూసిన ఉపాధి హామీ ఉద్యోగులకు నిరాశే ఎదురైంది.

ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిత్యం ప్రజల్లో ఉంటూ ఉపాధి హామీ పనులను గుర్తిస్తూ.. కూలీలకు పని కల్పిస్తున్నారు. కూలీలు చేసిన పనులను కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటారు. వీరందరూ జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ వంద రోజులు పని కల్పించేందుకు తీవ్రంగా శ్రమిస్తారు. కానీ.. వారికి జీతాలు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో ఉపాధి హామీ ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలు అందేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి జీతాలు రాలేదు. తాము నిత్యం పనులను పరిశీలించడానికి క్షేత్రస్థాయికి వెళ్లాల్సి ఉంటుందని, జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు అవుతున్నాయని అంటున్నారు. గ్రామంలో చేసిన పనుల నివేదికలు, మస్టర్లు, తదితర రిపోర్టులు మండల కేంద్రంలో సమర్పించడానికి వెళ్లాల్సి వస్తున్నదని చెప్తున్నారు. జీతాలు రాకపోవడంతో ఇల్లు గడవక అప్పులు చేసి కుటుంబ పోషణ చేస్తున్నట్లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు జీతాలు చెల్లించాలని ఉపాధి హామీ ఉద్యోగులు కోరుతున్నారు.

కుటుంబం గడవడం లేదు

జీతాలు రాకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లమైన మాకు తీవ్ర ఇబ్బంది అవుతుంది. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో బయట అప్పులు తెచ్చుకుని కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుంది. గ్రామంలో పనులు చూసుకుని తిరిగి మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు సైతం భారం అయ్యాయి. అప్పు తెచ్చిన దగ్గర వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఇంట్లో నెలవారీ ఖర్చులు, పిల్లల చదువులకు ఫీజులు చెల్లించేకపోతున్నాం. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి జీతాలు విడుదల చేయాలి.

– మేడ అయిలయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, బ్రాహ్మణపల్లి

కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

● పాఠశాల వార్షికోత్సవంలో డీఈఓ నారాయణరెడ్డి

● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని సాధించాలని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు తమలోని సృజనాత్మకతను వెలికి తీయాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో హరికృష్ణకు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

హరికృష్ణ (ఫైల్)

వలిగొండ, ఫిబ్రవరి 29 : మండలంలోని మునగాల తుర్కపల్లి గ్రామానికి చెందిన మాసంపల్లి హరికృష్ణ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించి ప్రకటించిన గురుకుల డిగ్రీ లెక్చరర్ పోస్టుల ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అత్యుత్తమ ర్యాంక్ సాధించానని, తన తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ శ్రమకోర్చి చదివించారని తెలిపారు. గణిత ఉపాధ్యాయుడు కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివానన్నారు. ఇటీవల ప్రకటించిన గురుకుల ఫలితాల్లో పీజీటీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, జేఎల్ స్టేట్ 3వ ర్యాంక్, గ్రూప్ ఫోర్త్‌లో 500వ ర్యాంక్ సాధించడంతోపాటు రైల్వేలో గ్రూప్–డీ పోస్టులకు గతంలో ఎంపికైనట్లు తెలిపారు. లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని తెలిపారు. గురుకుల డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన హరికృష్ణను బంధుమిత్రులు, స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మండల కమిటీ

నూతన కార్యవర్గ ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 29 : కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేన్ జిల్లా అధ్యక్షుడు చిరందాస్ ధనుంజయ, జిల్లా ఆర్గనైజ్ సెక్రటరీ గడ్డం వెంకటేశం, జిల్లా డైరెక్టర్ వారాల యాదిరెడ్డి సమక్షంలో పట్టణంలో బుధవారం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమృత అశోక్, ఉపాధ్యక్షులుగా వేముల వెంకటేశం, డాక్టర్ సీత భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా గుద్దేటి సుధాకర్, సహాయ కార్యదర్శిగా రుద్ర ప్రభాకర్, కోశాధికారిగా చెరుకు ఆనంద్, గౌరవ సలహాదారులుగా లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులుగా ఆంజనేయులు, శంకర్, మహేశ్వరి, రవి, కె.సాంబిరెడ్డి ఎన్నికయ్యారు.

దొంగలనుకుని ఇద్దరిని బంధించిన గ్రామస్తులు

● పోలీసులకు అప్పగింత

రాజాపేట, ఫిబ్రవరి 29 : మండలంలోని బొందుగులలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని గ్రామస్తులు పట్టుకొని కట్టేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరాఖండ్‌కు చెందిన ఇద్దరు ఎయిర్‌టెల్ టవర్ రిపేర్ కోసం బొందుగుల గ్రామానికి వచ్చారు. పనిలో భాగంగా అక్కడక్కడ ఆగి సెల్ సిగ్నల్ చెక్ చేస్తున్నారు. గమనించిన గ్రామస్తులు దొంగలనే అనుమానంతో పట్టుకొని గ్రామ చావడి వద్ద కట్టేసి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. సెల్ టవర్ రిపేర్ చేయడానికి వచ్చారని నిర్ధారించి విడిచి పెట్టినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

● ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 29 : ఉపాధి హామీ కూలీలందరికీ పని కల్పించాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి హామీ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో ఉపాధి హామీ పనిచేసే కూలీలకు పని ప్రదేశంలో మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ అంజిరెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ బాలస్వామి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ఆత్మకూరు(ఎం) : మృతుడు చందు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 29 : ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గట్టు చందు (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం ట్రాక్టర్ ట్రాలీతో మండల కేంద్రం పరిధిలోని కామునిగూడెం వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి పక్కనే ఉన్న బునాదిగాని కాల్వలో పల్టీ కొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన చందు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, రెండేండ్ల కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని భువనగిరి ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.